

నకిలీపై పీడీ యాక్ట్

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వ్యవసాయ అధికారులు హెచ్చరించారు. 10లో▸



నర్సింగ్ హోం సీజ్

ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటనలో చేవెళ్లలోని నర్సింగ్ హోంను వైద్యాధికారులు సీజ్ చేశారు. 10లో▸



ప్రాణం కాపాడిన హైడ్రా

హైడ్రా ఆధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ (డీఆర్ఎఫ్) బృందాలు శుక్రవారం ఓ నిండు ప్రాణాన్ని కాపాడాయి. 10లో▸

న్యూస్‌రీల్

రైతులకు అండగా కేంద్ర ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడ, రెడ్డిపల్లి గ్రామాల కిసాన్ కవచ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ అస్పద చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ సహకారంతో రైతులకు మందులు పిచికారీ చేసే సమయంలో వేసుకునే కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించే పంటలకు ప్రభుత్వం మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. పంటల సాగుతోపాటు మందుల పిచికారీలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు గున్నాల గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు గొర్కంటి రాజు, వినిత, శ్రీ అస్పద చారిటబుల్ ఫౌండేషన్ కో ఫౌండర్ టీవీ దేవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ 'దోస్త్'

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థులు జూన్ 9 వరకు రిజిస్ట్రేషన్ చేసేకునేందుకు అవకాశం ఉందన్నారు. ఎంపీసీ, ఎంజెడ్సీ, బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ, బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి



బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: ఈసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీరాములు, సీఈ జోగిరెడ్డి అన్నారు. నక్కలపల్లి–హైతాబాద్ మధ్యలో ఈసీ వాగుపై కొనసాగుతున్న వంతెన పనులను శుక్రవారం వారు మండల డిప్యూటీ డీఈ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం సీఆర్‌ఆర్ (కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్) కింద రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు విజయ్‌కుమార్ అధికారులకు తెలిపారు. పనులు జరుగుతున్న తీరును వారికి వివరించారు. అధికారులు మాట్లాడుతూ.. వంతెన నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతతో నిర్మించేలా చూడాలని సూచించారు.

పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నిరంజన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: పీసీసీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. కమిటీలో చోటు కల్పించడం సంతోషంగా ఉందని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపాలిటీల్లో .. మాన్‌సూన్

పురపాలికల్లో వంద రోజుల ప్రణాళిక

వానాకాలం ఎదురయ్యే సమస్యలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'మాన్‌సూన్' పేరిట వంద రోజుల ప్రణాళికకు సిద్ధం కావాలని ఆదేశించింది. డివిజన్ల వారీగా ఆయా కార్యక్రమాలు చేపడుతూ సమస్యలు పరిష్కరించాలని పేర్కొంది. ఈ మేరకు అధికారులకు యాక్షన్ ప్లాన్ రెడీ చేస్తున్నారు.

- జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు..
- వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా చర్యలు
- ప్రజారోగ్యం, పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి
- వన మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు



మీర్‌పేట కార్పొరేషన్ నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉంచిన మొక్కలు





మీర్‌పేట: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇక నుంచి అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10వ తేదీ వరకు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా ముందస్తుగా మురుగు కాలువలు, నాలాలు, ఓపెన్, భూగర్భ డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా ముంపు ప్రాంతాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయడంతో పాటు పాడైపోయిన మ్యాన్‌హోళ్లను గుర్తించి మరమ్మతులు చేపట్టనున్నారు.

ప్రజలకు ముందస్తుగా అవగాహన

వంద రోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. బస్తీలు, కాలనీలు, రహదారులు, ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో ప్రతిరోజు బ్లీచింగ్ చేయడం, ఫాగింగ్ చేయడం, చెరువుల్లో దోమలు వృద్ధి చెందకుండా యాంటీ లార్వా ద్రావణాన్ని వేయడం చేయనున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలకు ముందుస్తుగా అవగాహన కల్పించనున్నారు.

జిల్లాలోని మున్సిపాలిటీలు

ఆదిబట్ల, ఆమనగల్లు, చేవెళ్ల, కొత్తూరు, ఇబ్రహీంపట్నం, జల్‌పల్లి, మణికొండ, మొయినాబాద్, నార్సింగి, పెద్దఅంబర్‌పేట, షాద్‌నగర్, శంషాబాద్, శంకర్‌పల్లి, తుక్కుగూడ, తుర్కయంజాల్

కార్పొరేషన్‌లు

మీర్‌పేట, బడంగ్‌పేట, బండ్లగూడ జాగీర్

ఉమెన్ అమృత మిత్ర 2.0

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వన మహోత్సవానికి అధికారులు విస్తృత ఏర్పాట్లు చేయనున్నారు. ఈ మేరకు 'ఉమెన్ అమృత మిత్ర 2.0' కార్యక్రమంలో ఆయా మున్సిపాలిటీల్లో ప్రత్యేక ప్రదేశాన్ని గుర్తించి 'ఉమెన్ ఫర్ ట్రీ పేరిట' మహిళలతో మొక్కలు నాటించి సంరక్షించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో పాటు మున్సిపాలిటీల్లోని అన్ని పార్కులు, ఇళ్ల వద్ద, చెరువు కట్టలు, వాకింగ్ ట్రాక్‌లు, శ్మశానవాటికలు, క్రీడా ప్రాంగణాలు, ప్రభుత్వ భవనాల వద్ద ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టనున్నారు.

అన్ని చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్పొరేషన్‌లో వంద రోజుల ప్రణాళిక యాక్షన్‌ప్లాన్ ఇప్పటికే సిద్ధం చేశాం. ఏ రోజు ఏ కార్యక్రమం చేపట్టాలనే దానిపై అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశాం. రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటాం. అంటు రోగాలు ప్రబలకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తాం.

– జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట మున్సిపాలిటీ



తిరంగా ర్యాలీలో పాల్గొన్న డా.లక్ష్మణ్ తదితరులు

ప్రపంచానికి భారత్ సత్తా తెలిసింది

రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్

మీర్‌పేట: ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి భారత్ సత్తా తెలిసిందని రాజ్యసభ సభ్యుడు డా.లక్ష్మణ్ అన్నారు. వీర జవాన్లకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్ నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన తిరంగా ర్యాలీకి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మనిర్బర్ భారత్ పేరిట ప్రధాని మోదీ సారథ్యంలో దేశంలో తయారు చేసిన యుద్ధ యంత్రాలు, విమానాలు, ఆయుధాలు, ఆకాశ్, బ్రహ్మోస్ లాంటి క్షిపణులు, మిస్సైల్స్ ప్రపంచ దేశాలను అబ్బురపరిచాయని తెలిపారు. ఉగ్రవాదాన్ని యుద్ధనీతితో అంతం చేయాలన్న ఉద్దేశంతో భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వీరోచితంగా పోరాటం చేసి విజయం సాధించారన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో దేశ వ్యాప్తంగా మతాలు, భాషలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలంతా మువ్వన్నెల జెండాలను ప్రదర్శిస్తూ దేశభక్తిని చాటిచెప్పడానికి చేపడుతున్నదే తిరంగా ర్యాలీ అని వివరించారు. ప్రధాని మోదీ ఆర్టికల్ 370ని రద్దు చేసి కశ్మీరీలకు ఉద్యోగం, ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు పర్యాటకాన్ని అభివృద్ధి చేసి సుందర నగరంగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. ర్యాలీలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, నాయకులు బొక్క నర్సింహారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, మీర్‌పేట–1,2 అధ్యక్షులు భిక్షపతి చారి, ముఖేష్ ముదిరాజ్, గాజుల మధు, విక్కీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొన్న కారు

షాద్‌నగర్‌రూరల్: నారాయణపేట జిల్లా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వాహనాన్ని కారు ఢీ కొట్టింది. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ టోల్‌ప్లాజా వద్ద చోటుచేసుకుంది. వివరాలివీ.. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి శుక్రవారం తన కారులో హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్నారు. జడ్చర్లవైపు నుంచి షాద్‌నగర్‌వైపు వెళ్తున్న మరో కారు టోల్‌ప్లాజాలోని వేరే లైన్‌కు మారేందుకు డ్రైవర్ పక్కకు తిప్పాడు. ఎమ్మెల్యే వాహనం టోల్‌ప్లాజాను దాటి వెళ్తున్న సమయంలో పక్కనుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలూ దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి స్థానిక నేతలు గుమ్మడికాయ కొట్టి దిష్టి తీసి మరో వాహనంలో పంపించారు.



దెబ్బతిన్న ఎమ్మెల్యే కారు ముందుభాగం



దాసర్లపల్లిలో ఫాంపాండ్‌ను పరిశీలిస్తున్న బిహార్ ప్రజాప్రతినిధుల బృందం

గ్రామాల్లో బిహార్ బృందం పర్యటన

కందుకూరు: బిహార్ రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధుల బృందం మండల పరిధిలో పర్యటించింది. అక్కడి ప్రజాప్రతినిధులు 126 మంది హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ(డా.మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం)లో శిక్షణ పొందుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని దాసర్లపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో పర్యటించారు. దాసర్లపల్లిలో ఫాంపాండ్, ముచ్చర్లలో శ్మశానవాటిక, కంపోస్టు యార్డ్, పల్లె ప్రకృతి వనం, గ్రామ పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాల, నర్సరీ, పౌల్ట్రీ షెడ్ తదితరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి పథకాలు అమలు చేస్తున్నారు.. పంచాయతీలో మౌలిక సదుపాయాలు ఏవిధంగా సమకూరుస్తున్నారు.. ఇంటి పన్నులు ఏవిధంగా వసూలు చేస్తున్నారు.. కేంద్రం నుంచి వచ్చే నిధులను ఎలా వినియోగించుకుంటున్నారు అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి అభివృద్ధి పనులు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరిత, ఎంపీఓ గీత, ఏపీడీ చరణ్, ఏపీఓ రవీందర్‌రెడ్డి, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ ఫ్యాకల్టీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు లావణ్య, రమేష్, ఇంద్రసేన్, మహేశ్, ఈశ్వరి, రాజేష్, ఎఫ్ఏ వెంకటేశ్ పాల్గొన్నారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేసే కుట్ర

- రాష్ట్రంలో గ్యారంటీల ఊసేలేదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం రూరల్: పేద ప్రజలకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రను కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ మానుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద దేశంలో 30 కోట్ల మంది పేద ప్రజలు పని చేస్తున్నారని, మరో 65 లక్షల మంది పనికోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పేదలకు ఉపాధి కల్పించే చట్టాని నిర్వీర్యం చేయాలని చూస్తే బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్నారు. చట్టం ప్రకారం ప్రతి కూలీకి 100 రోజులు పని కల్పించాల్సిన ప్రభుత్వం 40 నుంచి 50 రోజులు మాత్రమే కల్పిస్తోందన్నారు. దేశంలో పనులు చేసే వారు లేరని మోదీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. పని కోసం దరఖాస్తు చేసుకున్న 65 లక్షల మందికి ఎందుకు పనులు కల్పించడం లేదని ప్రశ్నించారు. దినసరి కూలీ రూ.307 చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు నేటికీ అమలు చేయడం లేదన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల కష్టాలు తీరుతాయనుకుంటే భూస్వాములు, పెట్టుబడిదారులకు దాసోహం అవుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు ఇస్తామన్న రూ.12వేల ప్రస్తావన లేదని, మహిళలకు రూ.2,500 మాటలేదని, ఆడబిడ్డ పెళ్లి కానుక తులం బంగారం మరిచిపోయారన్నారు. హామీలు అమలు చేయడం చేతకాని సీఎం ఎందుకని, కుర్చీ దిగిపోవాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామేలు, డి.జగదీష్, కందుకూరి జగన్, జిల్లా నాయకులు నర్సింహ, కిషన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

దోపిడీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం



శిబిరంలో మాట్లాడుతున్న పంజాల రమేశ్

జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్

చేవెళ్ల: దేశంలో దోపిడీలేని సమాజ నిర్మాణమే లక్ష్యమని జనసేవాదళ్ రాష్ట్ర కన్వీనర్ పంజాల రమేశ్ అన్నారు. చేవెళ్లలోని సత్యసాయి పాఠశాల ఆవరణలో సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి జనసేవాదళ్ శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం సభ్యులకు లక్ష్యాలు, కర్తవ్యాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా జనసేవాదళ్ సభ్యులను తయారు చేస్తోందని తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే ముగింపు సభకు పదివేల మంది హాజరయ్యేలా రాష్ట్ర వ్యాప్తంగా ఈ శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయని చెప్పారు. సామాజిక అంశాలతోపాటు ప్రజలు విపత్కర పరిస్థితుల్లో ఉన్నప్పుడు సేవా కార్యక్రమాలు చేపట్టేలా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. పేద ప్రజల పక్షాన నిలబడి ఉద్యమించే విధంగా పార్టీకి ముందుండే నడిపించే సైనికుల్లా తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి కె.రామస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, నాయకులు వండ్ల మంజుల, మురళీమోహన్, కరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

చేవెళ్లలో కొనసాగుతున్న శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మంజుల, మక్బుల్, మీనాక్షి, శివ, అంజయ్య తదితరులు ఉన్నారు.

పెద్దఅంబర్‌పేటలో మరో పంచాయతీ విలీనం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో మరో గ్రామ పంచాయతీ విలీనం అయ్యింది. ఈ మున్సిపాలిటీకి ఆనుకుని ఉన్న యాదాద్రి జిల్లా పోచంపల్లి మండలానికి చెందిన సాయినగర్‌ను తెలంగాణ మున్సిపల్ చట్టం –2025ను అనుసరించి మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం విలీనం చేసినట్లు కమిషనర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలోని రికార్డులన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. పంచాయతీ భవనానికి ఉన్న పేరును తొలగించి పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం వార్డు కార్యాలయంగా బోర్డును ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా విలీనం అయిన సాయినగర్ పంచాయతీతో కలిపి పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘంలో మొత్తం 9 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి.



పంచాయతీ రికార్డులు స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్ రవీందర్‌రెడ్డి

కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఏంబీఏ గార్డెన్‌లో శుక్రవారం కల్వకుర్తి నియోజకవర్గ ముఖ్యనాయకుల, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ సిద్ధాంతమన్నారు. పార్టీ నిర్మాణంలో క్షేత్రస్థాయి నుంచి సామాజిక న్యాయం పాటించి ఆదర్శంగా నిలుద్దామని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పరిశీలకులు శివసేనారెడ్డి, ధారాసింగ్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగ రక్షణ సామాజిక న్యాయంపై పోరాడాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో చూపిన స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తచాటాలని, ప్రతి గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. అనంతరం డీలిమిటేషన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన వంశీచంద్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పొల్యూషన్ కంట్రోల్ మెంబర్ బాలాజీసింగ్, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివారెడ్డి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోం సీజ్



విజయ్ నర్సింగ్ హోం తనిఖీకివచ్చిన వైద్యబృందం



చేవెళ్ల: ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటనలో చేవెళ్లలోని విజయ్ నర్సింగ్ హోం (ప్రజావైద్యశాల)ను వైద్యాధికారుల బృందం శుక్రవారం సీజ్ చేసింది. మున్సిపల్ పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన కల్లెంల నర్సింలుకు విజయ్‌నర్సింగ్‌హోంలో ఆపరేషన్ చేశారు. వైద్య వికటించడంతో ఆయన గురువారం మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనల చేపట్టారు. వైద్యాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారులు చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వైద్య బృందాన్ని తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు నర్సింగ్ హోంకు వచ్చిన అధికారులు ఆస్పత్రికి తాళం వేసినట్లు గుర్తించారు. ఫోన్ సంప్రదించేందుకు యత్నించినా అందుబాటులోకి రాలేదు. దీంతో వైద్యాధికారుల బృందం ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రి వైద్యాధికారుల విచారణ పూర్తయ్యే వరకు తాళం తీయొద్దని హెచ్చరించారు. గతంలోనూ ఈ నర్సింగ్‌హోంను వైద్యాధికారులు తనిఖీ చేసిన సమయంలో కాలం చెల్లిన మందులు ఉన్నాయని నోటీసులు జారీ చేసిన ఇప్పటీ వరకు స్పందించలేదన్నారు. ఈ తనిఖీల్లో మొయినాబాద్ వైద్యాధికారి అన్నపూర్ణ, చేవెళ్ల సబ్ సెంటర్ వైద్యురాలు వేదశ్రీ తదితరులు ఉన్నారు.

అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి చోరీ

రూ.15లక్షల నగదు అపహరణ



బీరువా తాళాలు పగులగొట్టి చిందర వందరగా పడేసిన దుస్తులు

కొత్తూరు: బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేలోగా గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మురళీగౌడ్ తెలిపిన ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న యువజన కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి షాబాద్‌లో బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చే వరకు తాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానంతో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ.15 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

రేపటి నుంచి ఓయూలో తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీలలో జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి తరగతులను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లో కాలేజీలతో పాటు హాస్టల్స్, మెస్సులను కూడ పునఃప్రారంభించనున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ శివారులో గల బీబీజీ వెంచర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ దేవరాజ్ తెలిపిన ప్రకారం.. బీబీజీ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(28) మృతదేహం ఉన్నట్లు వెంచర్ నిర్వాహకులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియచేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ దేవరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటం, ఎముకలు తేలిపోవడం చూస్తుంటే 10 రోజుల క్రితమే మహిళ మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మహిళ ఆత్మహత్యకు పాల్పడిందా..? గుర్తు తెలియని వ్యక్తులు తీసుకువచ్చి హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వెంచర్ సూపర్‌వైజర్ ఇంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



షేక్ మహబూబ్(ఫైల్)

పహాడీషరీఫ్: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ మహబూబ్(70), షానవాజ్ బేగం దంపతులు దర్గా వద్ద నివాసం ఉంటున్నారు. ఐదు నెలలుగా మహబూబ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నెల క్రితం చివరగా కుమారుడు ముజఫర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మహబూబ్ అనంతరం అందుబాటులోకి రాలేదు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ముజఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.



అబ్దుల్లాపూర్‌మెట్: సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుజాత



మహేశ్వరం: మాట్లాడుతున్న ఏడీఏ సుధారాణి

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యాక్ట్

వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత

అబ్దుల్లాపూర్‌మెట్: నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించి రైతులను మోసం చేసే డీలర్లపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత హెచ్చరించారు. శుక్రవారం రైతువేదికలో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని అధీకృత డీలర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. డీలర్లు విధిగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి పల్లవి, ఎస్‌ఐ భద్యానాయక్, డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

మహేశ్వరం: ఎరువులు, విత్తనాల దుకాణాదారులు రైతులకు అధిక ధరలకు విక్రయించరాదని మహేశ్వరం వ్యవసాయ శాఖ ఏడీఏ సుధారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల దుకాణాదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాల డీలర్లు స్టాక్, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనుమతిలేని మందులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, డివిజన్ టెక్నికల్ అధికారి యాదగిరిగౌడ్, డీలర్లు పాల్గొన్నారు.

మినీ సిలిండర్‌తో మోది యువకుడి హత్య



సాయి కార్తీక్ మృతదేహం

రాజేంద్రనగర్: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు తన భార్య తన నుంచి దూరమయ్యేందుకు కారణమని భావించిన ఓ యువకుడు మరో యువకుడిని మినీ సిలిండర్‌తో తలపై మోది హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన సాయి కార్తీక్ (31), నవీన్ స్నేహితులు. ఇద్దరూ ఓ నెట్‌వర్క్ కంపెనీలో పని చేస్తూ అద్దె గదిలో ఉంటున్నారు. అదే ప్రాంతంలో సిద్ధార్థ్ రెడ్డి తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. సిద్ధార్థ్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. సిద్ధార్థ్ రెడ్డి, సాయి కార్తీక్, నవీన్‌లకు స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత అవసరాల నిమిత్తం సాయి కార్తీక్ సిద్ధార్థ్ రెడ్డి నుంచి రూ. 8 లక్షలు అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా కాలయాపన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సిద్ధార్థ్ రెడ్డి భార్య గత నెలలో అతడితో గొడవ పడి వెళ్లిపోయింది. సాయి కార్తీక్ ఇందుకు కారణమని సిద్ధార్థ్ రెడ్డి భావించాడు. గురువారం రాత్రి ముగ్గురు కలిసి సాయి కార్తీక్ రూమ్‌లో మద్యం తాగారు. ఈ సందర్భంగా సాయి కార్తీక్, సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాట మాట పెరిగింది. దీంతో నవీన్ జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పాడు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి మళ్లీ వైన్స్ షాప్ వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు చేసి గదికి వచ్చి మద్యం తాగారు. అనంతరం మరోసారి సాయి కార్తీక్, సిద్ధార్థ్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నవీన్ సముదాయించేందుకు ప్రయత్నించగా సిద్ధార్థ్ రెడ్డి అతడిని బయటికి పంపించాడు. అర గంట తర్వాత నవీన్ రూమ్ గదికి వెళ్లి చూడగా సాయి కార్తీక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పక్కనే కూర్చుని ఉన్న సిద్ధార్థ్ రెడ్డిని ఏం జరిగిందని ప్రశ్నించగా మినీ సిలిండర్‌తో కొట్టి చంపేశానని... నిన్ను కూడా చంపుతానని దాడి చేసేందుకు ప్రయత్నించగా నవీన్ బయటికి పరుగులు తీశాడు. బుద్వేల్ ప్రధాన రహదారిపైకి వచ్చి స్థానికులకు ఈ విషయం చెప్పాడు. దీంతో వారు అక్కడికి వెళ్లి సిద్ధార్థ్ రెడ్డిని పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సిద్ధార్థ్ రెడ్డిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు తీసుకుని చెక్కేశాడు

- ఇద్దరు మహిళల పేరుతో రూ. 25 లక్షల రుణం
- యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: ఓ వ్యక్తి ఇద్దరు మహిళల పేరున రూ.25 లక్షలు రుణం తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదగిరినగర్‌కు చెందిన యూ ట్యూబర్‌గా పని చేస్తోంది. ఆమెకు పరిచయస్తురాలైన నాగరాణి అనే యువతి గత ఏడాది రాజశేఖర్ అనే వ్యక్తిని పరిచయం చేసింది. అతను దీవెనకు ఫోన్ చేసి అకౌంట్ నెంబర్ అడిగి ప్రతినెల రూ. 20 వేలు నగదు డిపాజిట్ చేస్తానని చెప్పాడు. దీంతో ఆమె ఈ విషయాన్ని తన స్నేహితురాలు నవజ్యోతికి వివరించి ఇద్దరి నెంబర్లు ఇస్తామని, ఇరువురికీ నగదు వేయాలని రాజశేఖర్‌ను కోరింది. అందుకు అంగీకరించిన అతను వారి నుంచి ఆధార్‌కార్డులు, వేలిముద్రలు, తీసుకుని వారి పేరున బ్యాంక్ ఖాతాలు తెరిచాడు. మూడు నెలల పాటు ఆయా అకౌంట్లలో నగదు డిపాజిట్ చేసిన అతను, నాలుగో నెల వేయలేదు. దాంతో వారు బ్యాంకులకు వచ్చి ఆరా తీయగా దీవెన పేరున రూ. 10 లక్షలు, నవజ్యోతి పేరుతో రూ. 15 లక్షలు రుణం తీసుకున్నట్లుగా తెలిసింది. తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాలీ ఆటోను ఢీ కొన్న రెడీమిక్స్ లారీ

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- 11 మంది వలస కూలీలకు గాయాలు

గచ్చిబౌలి: రెడీమిక్స్ లారీ టాటా ఏసీ ట్రాలీ ఆటోను ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. 11 మందికి గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్టీఆర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేష్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం గోపన్‌పల్లి ఎన్టీఆర్‌నగర్‌లో లేబర్ అడ్డా వద్ద కూలీలను ఎక్కించుకుని టాటా ఏసీ ట్రాలీ ఆటో వట్టినాగులపల్లి వైపు వెళుతోంది. కొద్ది దూరం వెళ్లగానే వెనక నుంచి వేగంగా వచ్చిన రెడిమిక్స్ లారీ ఢీ కొట్టింది. దీంతో ట్రాలీ ఆటో పల్టీ కొట్టి డివైడర్ వరకు దూసుకు వెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్నవారు ఎగిరి పడ్డారు. బీహార్‌కు చెందిన దిల్‌కుష్ కుమార్(22) తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని సిటీజన్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దిల్‌కుష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.కర్నాటక చించోలీకి చెందిన కీము(45) తీవ్ర గాయాలు కావడంతో మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాలీ ఆటో డ్రైవర్ దానాతో పాటు లక్ష్మణ్, సువాలీ, చాంధీ, జాను బాయ్, రవి నాయక్, పీరా, రాహుల్, చందు, నార్య, బాదల్ కుమార్‌కు గాయాలయ్యాయి. వారికి సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి పంపారు. శ్రీ డెక్కన్ రెడీమిక్స్‌కు చెందిన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యంతోనే మెరుగైన అవకాశాలు

సాక్షి,సిటీబ్యూరో: యువత నైపుణ్యం లేకపోతే ఏ రంగంలోనూ రాణించలేరని, నిరాశ, నిరుద్యోగం దేశ అభివృద్ధిని మింగేస్తాయని ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ చైర్మన్ కాశీ ప్రసాద్ అన్నారు.దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారేనని, కానీ వీరికి తగిన నైపుణ్యత లేక పోవడం పరిస్థితి భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఒక కఠినమైన వాస్తవాన్ని ఎదుర్కోవాల్సిందేనన్నారు. దేశంలోని పట్టభద్రుల్లో 48 శాతం మంది ఉద్యోగయోగ్యులు కారని, ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం ప్రతి సంవత్సరం కోటి మందికి పైగా విద్యార్థులు డిగ్రీలు పొందుతున్నా.. కంపెనీలు మాత్రం ఉద్యోగానికి సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఎంపిక చేయడంలో ఇబ్బందులు పడుతున్నాయన్నారు.

రూ.21 వేలతో మొదలుపెట్టి రూ.61లక్షలు టోకరా!

ఆన్‌లైన్ ద్వారా ఎరవేసిన సైబర్ నేరగాళ్లు

- ట్రేడింగ్‌లో లాభాలంటూ మోసం
- యాప్‌లో బ్యాలెన్స్ చూపిస్తూ వ్యవహారం
- కేసు నమోదు చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో నిండా ముంచారు. భారీ లాభాలు వస్తాయంటూ ఆశపెట్టి, రూ.21 వేలతో మొదలుపెట్టి, వర్చువల్ ఖాతాలో బ్యాలెన్స్ చూపించి రూ.61 లక్షలు స్వాహా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్‌కు చెందిన బాధితుడికి (68) ఆన్‌లైన్‌లో వచ్చిన ఎక్స్‌పర్ట్స్ ప్రో లిమిటెడ్ ప్రకటన కనిపించింది. బులియన్ మార్కెట్.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారా ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు ఉంటాయని అందులో ఉంది. దీనికి ఆకర్షితుడైన అతను ఆ సంస్థకు చెందిన యాప్‌ను లింకు ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీని ద్వారా వర్చువల్ ట్రేడింగ్ అకౌంట్ తెరిచాడు. తొలిసారిగా ఈ ఏడాది మార్చి 27న రూ.21 వేలు పెట్టుబడి పెట్టారు. ఆపై బాధితుడితో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపిన నేరగాళ్లు స్థానిక మార్కెట్ కాకుండా అంతర్జాతీయ ట్రేడింగ్ చేస్తే డాలర్లలో లాభాలు వస్తాయని, అందుకు అవసరమైన సలహాలు సూచనలు తామే ఇస్తామని నమ్మించారు. ఇలా కొంత పెట్టుబడి పెట్టించిన తర్వాత ఆయా స్టాక్‌లకు సంబంధించిన మార్జిన్ వాల్యూస్ పడిపోతున్నాయని, లాభాలు పొందటంతో పాటు ఉన్న నిధులు కోల్పోకుండా ఉండాలంటే మరికొంత మొత్తం పెట్టుబడిగా పెట్టాలని భయపెట్టారు. ఆ మొత్తం పెట్టిన బాధితుడు తనకు ట్రేడింగ్‌లో ఆసక్తి లేదని, తనకు ఉన్న నిధులు డ్రా చేసుకుని నిష్క్రమించాలని భావిస్తున్నట్లు నేరగాళ్లకు చెప్పాడు. దీనికి అనుమతించని వారు మరికొంత పెట్టుబడి పెట్టాలని బెదిరించారు. తన వద్ద ఉన్న మొత్తం ఇన్వెస్ట్ చేసిన బాధితుడు ఇకపై తాను పెట్టుబడి పెట్టలేనని స్పష్టం చేశాడు. అయినా వారి ఫోన్లు, ట్రేడింగ్ కొనసాగింది. ఈ నెల 21న బాధితుడు తన కుటుంబంతో కలిసి వేరే ఊరు వెళ్లారు. అలా వెళ్తున్న విషయం నేరగాళ్లకు చెప్పి, తన ట్రేడింగ్ ఖాతా నిర్వహించమని కోరారు. అందుకు అంగీకరించిన వారు అతను తిరిగి వచ్చేలోపు అనేక ఫోన్లు చేశారు. ఇంటికి చేరుకున్న బాధితుడు వారిని సంప్రదించగా... అత్యవసరంగా రూ.10 లక్షలు చెల్లించకపోతే ట్రేడింగ్ ఖాతానే కోల్పోవాల్సి వస్తుందని బెదిరించారు. ఈ నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి బాధితుడు చెల్లింపులు ఆపేశాడు. కొన్ని రోజులకు బాధితుడికి ఫోన్ చేసిన మరో నేరగాడు కోల్పోయిన నిధులను తిరిగి వచ్చేలా చేస్తానని నమ్మించాడు. దీనికోసం నామమాత్రం పెట్టుబడి పెట్టాలని, ట్రేడింగ్ యాప్‌లో 75 వేల అమెరికన్ డాలర్లు (రూ.64.16 లక్షలు) ఉన్నాయని చూపించాడు. కొన్నాళ్లుగా ట్రేడింగ్ చేయకపోవడంతో ఆ ఖాతా లాక్ అయిందని, ఆ మొత్తం విత్‌డ్రా చేసుకోవాలంటే అన్‌లాక్ చేయించాలన్నాడు. ఈ పేరుతో మరి కొంత మొత్తం స్వాహా చేశారు. ఇలా మొత్తం రూ.61.95 లక్షలు సైబర్ నేరగాళ్లకు చెల్లించిన బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించారు. దీంతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆన్‌లైన్‌లో ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ప్రాణం కాపాడిన హైడ్రా

- శుక్రవారం ఒకేసారి రెండుచోట్ల అగ్ని ప్రమాదాలు
- సమాచారం అందటంతోనే రంగంలోకి డీఆర్‌ఎఫ్
- అమీర్‌పేటలో రాజేష్ అనే యువకుడి రెస్క్యూ



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా ఆధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ (డీఆర్‌ఎఫ్) బృందాలు శుక్రవారం ఓ నిండు ప్రాణాన్ని కాపాడాయి. ఒకే సమయంలో రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు జరగడంతో ఎక్కడికక్కడ ఈ బృందాలు రంగంలోకి దిగాయి. అమీర్‌పేటలో జరిగిన ప్రమాదం నుంచి రాజేష్‌ను (25) సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం అమీర్‌పేట, పటాన్‌చెరుల్లో ఒకే సమయంలో అగ్గి రాజుకుంది. సారథి స్టూడియో సమీపంలోని ఐదు అంతస్తుల దివ్య శక్తి అపార్ట్‌మెంట్స్ రెండో ఫ్లోర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడి ఓ డబ్బింగ్ స్టూడియోలో మంటలు అంటుకోగా... సమాచారం అందుకున్న హైడ్రా కంట్రోల్ రూమ్ డీఆర్‌ఎఫ్ బృందాలను హుటాహుటిన ఆ ప్రాంతానికి పంపింది. ఏసీ యూనిట్‌కు సంబంధించిన కంప్రెషర్ పేలడంతోనే మంటలు వ్యాపించినట్లు గుర్తించాయి. స్టూడిలో చిక్కుకుపోయిన రాజేష్ చౌదరిని బయటకు తీసుకువచ్చాయి. ఈ మంటలు ఇతర అంతస్తులకు వ్యాపించకుండా డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది నిలువరించారు. స్టూడియోలో చిక్కుకున్న రాజేష్‌ను ల్యాడర్ ద్వారా వెళ్లి కాపాడిన డీఆర్‌ఎఫ్ సభ్యుడు శ్రీకాంత్‌ను కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. అలాగే... పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పాటి గ్రామంలో అను ఫర్నీచర్ గోదాంలోనూ అదే సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. అక్కడికి చేరుకున్న మూడు డీఆర్‌ఎఫ్ బృందాలు మంటల వ్యాప్తిని నిలువరించాయి.

నల్లా బిల్లులపై మొబైల్ మెసేజ్‌లకు స్పందించొద్దు

సాక్షి,సిటీ బ్యూరో: నల్లాబిల్లు చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామని మొబైల్ నెంబర్లకు వస్తున్న మెసేజ్‌లకు స్పందించవద్దని జలమండలి విజ్ఞప్తి చేసింది. ఇటీవల మొబైల్ నెంబర్ 84271 56645 నుంచి గతనెల బిల్లు చెల్లించకపోతే మీ నల్లా కనెక్షన్లు తొలగిస్తామని, వివరాలకోసం 9064953421 ను సంప్రదించాలని సమాచారం అందుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని జలమండలి పేర్కొంది. సదరు నంబర్‌ను సంప్రదించగానే ప్రాసెసింగ్ పేరుతో వాట్సాప్ ద్వారా ఏపీకే ఫైల్‌ను వస్తుందని, ఇలాంటి మెసేజ్‌లు జలమండలి పంపినవి కావని స్పష్టం చేసింది. సంబంధిత నంబర్లను సంప్రదించకుండా, వాట్సాప్‌కు వచ్చిన ఫైల్‌లను డౌన్‌లోడ్ ,ఇన్ స్టాల్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని జలమండలి వినియోగదారులకు విజ్ఞప్తి చేసింది. జలమండలి నుంచి అధికారిక సమాచారాలు కేవలం అధికారిక మార్గాల (పేపర్లు, వివిధ టీవీ చానెల్‌లు) ద్వారా జారీ అవుతాయని వెల్లడించింది. ఏవైనా సమస్యలు లేదా సేవా సంబంధిత సందేహాలు ఉంటే జలమండలి కస్టమర్ కేర్ 155313ని సంప్రదించాలని కోరింది.